https://share.google/guuFZEe1bsLbdMXq5

https://youtu.be/qrJ_bP82WUk?si=kp4qwJCDC5pIHyn2

nw

ఈనాడు
epaper.eenadu.net

# ఎస్టీపీలున్నా శుద్ధి చేయకుండానే చెరువుల్లోకి మురుగు

ఈనాడు, హైదరాబాద్; ఓయూ, న్యూస్‌టుడే : రాబోయే 15 నుంచి 20 ఏళ్ల సుదీర్ఘ ప్రణాళికతో హైదరాబాద్ నగర నీటి వనరులను కాపాడి, భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే హైడ్రా లక్ష్యమని కమిషనర్ ఎ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలో చెరువుల ఆక్రమణల తొలగింపుతో పాటు వాటి శాశ్వత పునరుద్ధరణే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. సీఎస్ఐఆర్-నీరి హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసీటీ ప్రాంగణంలో 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణలో పరిశ్రమలు, నియంత్రణ సంస్థల పాత్ర' అంశంపై శుక్రవారం నిర్వహించిన జాతీయ కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఒకవైపు చెరువులను బాగు చేస్తూ.. మరోవైపు మురుగు నీరు కలుస్తుంటే ప్రయోజనం ఉండదని.. హుస్సేన్‌సాగర్ ఉదంతాన్ని హైడ్రా కమిషనర్ ఉదాహరించారు. బుల్కాపూర్ నాలా నుంచి వచ్చే నీరు శుద్ధి చేస్తుండగా కూకట్‌పల్లి నాలా నుంచి మురుగు వచ్చి కలుస్తోందన్నారు. దుర్గం చెరువులోకి 9 ఇన్‌లెట్‌లు ఉంటే ఒక చోటే నీటి శుద్ధి చేస్తున్నారన్నారు. చాలాచోట్ల మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఉన్నప్పటికీ నిర్వహణ ఖర్చులు తగ్గించుకునేందుకు నిర్వాహకులు తప్పుడు రీడింగ్స్ చూపించడం తమ పరిశీలనలో గుర్తించామన్నారు. ఒక ఎంఎల్‌డీ మురుగు నీటిశుద్ధికి నెలకు దాదాపు రూ.2.5 లక్షల వ్యయం అవుతుండటంతో సెన్సార్ల రీడింగ్స్ ట్యాంపర్ చేస్తూ జలమండలిని మభ్యపెడుతున్నారని తెలిపారు. తప్పుడు నివేదికలను అరికట్టడానికి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాల ద్వారా చెరువుల్లోని నీటిరంగు, క్లోరోఫిట్ స్థాయిలు, గుర్రపుడెక్క విస్తరణ రియల్‌టైమ్ పర్యవేక్షించే చర్యలు చేపడుతున్నామన్నారు. మురుగునీటిని సరిగ్గా శుద్ధి చేయకుండా కేవలం గుర్రపుడెక్కను తొలగిస్తే కొన్నాళ్లకే అవి మళ్లీ పెరుగుతాయన్నారు. జలమండలి,

సమావేశ ప్రారంభోత్సవంలో ఎస్.వెంకటమోహన్, షేక్ బాషా, డి.శ్రీనివాస్‌రెడ్డి, ఏకలవ్య శర్మ, ఎ.వి.రంగనాథ్, రామకృష్ణ, ఎస్.ఎన్.శాస్త్రి

కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీ వంటి సంస్థల మధ్య సమన్వయం లోపించి జవాబుదారీతనం కొరవడిందన్నారు. కెప్టెన్ లేని ఫుట్‌బాల్ జట్టులా ఉన్న ప్రస్తుత వ్యవస్థకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వం ఒక సమగ్ర క్యూర్ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు.

## స్థానిక సమాజాల భాగస్వామ్యంతోనే..

పర్యావరణ పునరుద్ధరణ స్థానిక సమాజాల భాగస్వామ్యంతోనే సాధ్యమని దిహిమాలయ ఇనిషియేటివ్ (అశోక ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ అండ్ ద ఎన్విరాన్‌మెంట్) వ్యూహాత్మక సలహాదారు, డైరెక్టర్ 'పద్మశ్రీ' డాక్టర్ ఎకలవ్య శర్మ అన్నారు. భూతాపంతో హిమాలయాల్లో ఊహించిన దాని కంటే వేగంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ అత్యవసరమైతే.. హిమాలయాల్లో మంచుకొండలు కరిగి చెరువులుగా ఏర్పడటం ఆందోళనకరమన్నారు. ఇవి హఠాత్తువరదలకు, భారీ ఆస్తి, ప్రాణనష్టాలకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, నీరి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకట మోహన్, ఎస్.ఎన్.శాస్త్రి, శాస్త్రవేత్తలు డాక్టర్ షేక్ బాషా, డాక్టర్ రామకృష్ణ మాట్లాడారు.

Date : 10/10/2026 EditionName : GREATER HYDERABAD PageNo :

ఆంధ్రజ్యోతి

# చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ

సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**తార్నాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):** సమస్త ప్రాణులకు జీవనాధారమైన జలవనరులను కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించగలమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. 'పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు, నిబంధనలు' అంశంపై సీఎస్ఐఆర్ - ఐఐసీటీలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. హైడ్రా ఇప్పటికే ఆరు చెరువులు అభివృద్ధి చేసిందని, రెండో దశలో 14 చెరువుల పునరుద్ధరణ చేపట్టామన్నారు. నగరంలో ప్రస్తుతం ఉన్న చెరువులు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించడంతోపాటు.. చుట్టూ పార్కులు, ప్లే ఏరియాల అభివృద్ధి, ఔషధ గుణాలున్న మొక్కలు నాటుతున్నామన్నారు. చెరువుల పునరుద్ధరణ, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పర్యావరణాన్ని ఎలా కాపాడాలో ప్రాక్టికల్‌గా హైడ్రా చేసి చూపించిందని అశోక ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ ఫర్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ ఏకలవ్య శర్మ, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

లు కీలకం

సాక్షి

# చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- మొక్కకు నీరుతో వినూత్నంగా కార్యక్రమం ప్రారంభం

**సాక్షి, సిటీబ్యూరో:** సకల జీవకోటికీ ప్రాణాధారమైన జలవనరులను కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యమైన జీవనాన్ని అందించగలమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. 'నీరి' ఆధ్వర్యంలో 'పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు– నిబంధనాధికారుల' అనే అంశంపై ఐఐసీటీలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సులో మాట్లాడారు. సాధారణంగా ఇలాంటి సదస్సుల్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం పరిపాటి. అయితే ఇది పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సదస్సు కావడంతో మొక్కకు నీళ్లు పోసి ప్రారంభించారు. చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని

పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణతో పాటు పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణను హైడ్రా ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తోందని సదస్సుకు హాజరైన పద్మశ్రీ పురస్కార గ్రహీత, వ్యూహాత్మక సలహాదారు, ది హిమాలయ ఇనిషియేటివ్, అశోకా ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఏకలవ్య శర్మ, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు.

ఆంధ్రప్రభ

Scan to Read Full Paper

# చెరువుల పునరుద్ధరణతోనే పర్యావరణ పరిరక్షణ

**పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు శాస్త్రీయ పరిజ్ఞానం అవసరం**

**చెరువుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం**

**జాతీయ వర్క్‌షాప్‌లో నిపుణులు, శాస్త్రవేత్తల పిలుపు**

**చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చర్యలను వివరించిన కమిషనర్ రంగనాథ్**

తార్నాక, అక్టోబర్ 9 (ఆంధ్రప్రభ): పర్యావరణ సుస్థిరత, పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణ, చెరువుల పునరుజ్జీవనానికి శాస్త్రీయ పరిజ్ఞానంతోపాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పలువురు ప్రముఖులు, శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొన్నారు. ఈమేరకు సీఎస్ఐఆర్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి) హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఐఐసీటీలోని పీఎం భార్గవ ఆడిటోరియంలో ఎకోసిస్టమ్ రెస్టోరేషన్ అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ది హిమాలయ ఇనిషియేటివ్ స్ట్రాటజిక్ అడ్వైజర్, డైరెక్టర్, పద్మశ్రీ డాక్టర్ ఏకలవ్య శర్మ మాట్లాడుతూ జీవవైవిధ్య సంరక్షణకు అత్యుత్తమ శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. పర్యావరణ పునరుద్ధరణ ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను సాధించాలంటే స్థానిక ప్రజలకు పూర్తి భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. విస్తృత సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు హిమాలయాల సంరక్షణలో చేపట్టిన చర్యలు, అనుభవాలను వివరించారు. పర్యావరణ రక్షణకు పరిశ్రమలు, సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలు, విధానకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. పర్యావరణ విఘాతం కారణంగా ఇటీవల నేపాల్‌లో సంభవించిన వరదలకు గల కారణాలను ఉదహరించారు. విశిష్ట అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ మాట్లాడుతూ నగరంలో చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. చెరువుల పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. దెబ్బతిన్న చెరువులను తిరిగి పర్యావరణ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లో అన్యాక్రాంతమైన బతుకమ్మ కుంట, నల్లచెరువు వంటి పలు చెరువులను పునరుద్ధరించిన పద్ధతులను ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఎన్. శాస్త్రి, సీఎస్ఐఆర్-నీరి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకట మోహన్, నీరి హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం చైర్ డాక్టర్ షేక్‌భాషాతోపాటు దాదాపు 200 మంది ప్రతినిధులు పాల్గొని పర్యావరణ పరిరక్షణపై సమగ్రంగా చర్చించారు. ఈ సదస్సు ద్వారా పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వర్క్‌షాప్ నిర్వాహకులు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# ప్రకృతి పరిరక్షణే లక్ష్యం

- సీఎస్ఐఆర్-నీరి సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్

**దిశ, తెలంగాణ బ్యూరో/సికింద్రాబాద్**

సకల జీవకోటికి ప్రాణాధారమైన జలవనరులను కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు ఆరోగ్యమైన జీవనాన్ని అందించగలమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు – నిబంధనాధికారుల పాత్రపై సీఎస్ఐఆర్ – ఐఐసీటీలో జరిగిన జాతీయ సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. ఎన్ఆర్ఎస్సీ లెక్కల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగవ్వగా.. మిగతావి ఆక్రమణలకు గురై ఉనికిని కోల్పోయాని చెప్పారు. ప్రకృతి పరిరక్షణ ఎలానో చెరువుల పునరుద్ధరణతో పాటు.. పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో హైడ్రా ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తోందని సదస్సుకు హాజరైన పద్మశ్రీ పురస్కార గ్రహీత, వ్యూహాత్మక సలహాదారు, ది హిమాలయ ఇనిషియేటివ్, అశోకా ట్రస్ట్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ (ఏటీఆర్ఈఈ) డైరెక్టర్ ఏకలవ్య శర్మ, సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. సీఎస్ఐఆర్-నీరి(ఎన్ఈఈఆర్ఐ) నాగ్‌పూర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటమోహన్, నీరి హైదరాబాద్ శాస్త్రవేత్తలు డాక్టర్ షేక్ బాషా, డాక్టర్ టీవీటీపీఎస్ రామకృష్ణ సదస్సులో పాల్గొని పర్యావరణ పరిరక్షణ అంశాలపై చర్చించారు.

## వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని శుక్రవారం హైడ్రా ఒక ప్రకటనలో కోరింది. ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో), స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలపై హైడ్రా ఎక్కడా నేరుగా చర్యలు తీసుకోదని స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల విజ్ఞప్తి మేరకే ప్రమాదకరమైన భవనాలను తొలగిస్తోందని పేర్కొంది. కూలిపోయే స్థితిలో ఉండి.. ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే భవనాల్లో హాస్టళ్లు నిర్వహించరాదని స్పష్టం చేసింది. సురక్షితమైన భవనాల్లోకి హాస్టళ్లు మార్చాలని సూచించింది. ఇందుకుగాను డిసెంబరు 31వ తేదీ వరకూ గడువు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. హైడ్రా పేరు చెప్పి డబ్బులు దండుకునే వారిపై నేరుగా హైడ్రా, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించింది.

నవతెలంగాణ

# చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణ

- ప్రకృతిని కాపాడడమే హైడ్రా లక్ష్యం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

నవతెలంగాణ-నాచారం

సీఎస్ఐఆర్-ఐఐసీటీలో పర్యావరణ పునరుద్ధరణ, పరిశ్రమలు, నియంత్రణ సంస్థల పాత్రపై నిర్వహించిన జాతీయ సదస్సులో చెరువులు, నాలాలను పరిరక్షించి భవిష్యత్ తరాలకు పర్యావరణహితమైన నగరాన్ని అందించడమే హైడ్రా లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. జలవనరులను కాపాడుకున్నప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించగలమని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరు చెరువుల పునరుద్ధరణ పనులు పూర్తిచేయగా, రెండో దశలో మరో 14 చెరువుల అభివృద్ధి పనులు చేపట్టినట్టు వెల్లడించారు. జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్ఆర్ఎస్సీ గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లో 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని, మిగిలిన చెరువులు సైతం ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. ఆక్రమణల తొలగింపుతోపాటు చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం సవాలుగా మారిందన్నారు. చెరువు ఆనవాళ్లు కోల్పోయిన బతుకమ్మకుంటను పునరుద్ధరించి, పరిసర ప్రాంతాల్లో వరద సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువు వంటి జలవనరులను అభివృద్ధి చేసి, వాటి పరిసరాల్లో పార్కులు, ఆటస్థలాలు ఏర్పాటు చేయడంతోపాటు ఔషధ మొక్కలను నాటుతున్నట్టు తెలిపారు. చెరువుల పునరుద్ధరణకు ముందు, తర్వాత వచ్చిన మార్పులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పాతబస్తీలోని బమ్రుకన్ ఉద్ దౌలా చెరువు ఆక్రమణల కారణంగా 4.5 ఎకరాలకు పరిమితం కాగా, పునరుద్ధరణ చర్యలతో 17.5 ఎకరాలకు విస్తరించినట్టు పేర్కొన్నారు. ఇతర చెరువుల్లోనూ ఆక్రమణలను తొలగించి వాటి సహజ స్వరూపాన్ని కాపాడేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

## హైడ్రా చర్యలను అభినందించిన నిపుణులు

చెరువుల పునరుద్ధరణతోపాటు పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో హైడ్రా చేపడుతున్న చర్యలను పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఏట్రీ డైరెక్టర్ డాక్టర్ ఎకలవ్య శర్మ, సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు నిపుణులు అభినందించారు. చెరువుల సహజ లక్షణాలైన ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను పరిరక్షిస్తూ పునరుద్ధరణ చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు. జలవనరుల కాలుష్యాన్ని అరికట్టడం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ సదస్సులో సీఎస్ఐఆర్-నీరి నాగ్‌పూర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటమోహన్, నీరి హైదరాబాద్ శాస్త్రవేత్తలు డాక్టర్ షేక్ బాషా, డాక్టర్ టీపీటీపీఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణపై చర్చించారు.